సాక్షి
అనకాపల్లి
సోమవారం । 6 । మార్చి । 2023



ఆ కలయికకు 46 ఏళ్లు!

వారంతా 46 ఏళ్ల క్రితం కలిసి ఇంటర్ చదువుకున్నారు. ఆదివారం ఒక చోట కలుసుకుని, పాత జ్ఞాపకాలు పంచుకున్నారు. 8లో



రేపే అప్పన్నకు పెళ్లిచూపులు

ఫాల్గుణ పౌర్ణమి పురస్కరించుకుని సింహాచలం వరాహ లక్ష్మీ నృసింహస్వామికి మంగళవారం పెళ్లి చూపులు జరగనున్నాయి. 8లో



ప్రకృతి సాగు.. బాగుబాగు

ఆ రైతు ప్రకృతిసాగు ద్వారా అద్భుతమైన ఆదాయం ఆర్జిస్తున్నాడు. పంట మార్పిడిలో తోటి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు. 10లో

న్యూస్‌రీల్

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి

సీతంపేట: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నట్లు సహాయ రిటర్నింగ్ అధికారి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి అన్నారు. స్వర్ణభారతి స్టేడియంలో జరుగుతున్న ఎన్నికల ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ, పోలింగ్ తర్వాత మెటీరియల్స్ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చడం, కౌంటింగ్ ఏర్పాట్ల గురించి ఆరా తీశారు. కౌంటింగ్ సమయంలో ఎన్నికల పరిశీలకులు, పోటీలో పాల్గొన్న అభ్యర్థులు, ఏజెంట్లకు కల్పించే సదుపాయాల గురించి అధికారులతో చర్చించారు. సీసీ కెమెరాల ఏర్పాటు, ఎన్నికల సామగ్రి పంపిణీ, కౌంటింగ్ సమయంలో సమాచారం ఏ విధంగా అందించాలి తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కర్‌రెడ్డి, సింహాచలం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామలక్ష్మి, నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్, సూపరింటెండెంట్ రామారావు పాల్గొన్నారు.

నూకాంబికకు వెండి కిరీటం



అమ్మవారికి వెండి కిరీటం అలంకరిస్తున్న భక్తులు

ఎస్.రాయవరం: కొరుప్రోలులో నూకాంబిక అమ్మవారికి 2.7 కిలోల వెండి కిరీటాన్ని ఆదివారం గ్రామానికి చెందిన ఇందుకూరి బంగారమ్మ కుటుంబ సభ్యులు అందజేశారు. దీని విలువ రూ.2.46 లక్షలని దేవదాయశాఖ ఈవో మురళీకృష్ణ తెలిపారు. ఆ కిరీటాన్ని గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు సమక్షంలో అమ్మవారికి అలంకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొరపాటి గోపాలం, గ్రామ పెద్దలు కొంగర రాజు, కొంగర రాజు, ప్రత్తిపాటి సత్యనారాయణ, బత్తిన కన్నారావు, మాజీ ఎంపీటీసీ చేకూరి వరహాలరాజు పాల్గొన్నారు.

112 కిలోల గంజాయి స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

చోడవరం రూరల్: రెండు ఆటోల్లో తరలిస్తున్న 112 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఐదుగురిని అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ బి.అప్పలనాయుడు తెలిపారు. ఆదివారం చోడవరం సమీపంలోని చుక్కావారి కళ్లాల వద్ద ముందుగా మోటార్‌సైకిల్‌పై ఒకరు పైలట్‌గా వెళ్తూ, వెనుక రెండు ఆటోల్లో గంజాయిని తరలిస్తుండగా పట్టుకున్నట్టు చెప్పారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలుకు చెందిన కొర్రా చిన్నారావు, కొర్రా లక్ష్మణ్, వంతాల శివన్న, ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ముజఫర్ నగర్‌కు చెందిన ఉస్మాన్, అదే ప్రాంతానికి చెందిన బాబులు అనే నిందితులను అరెస్టు చేశామన్నారు. వీరి నుంచి గంజాయి, రెండు ఆటోలతోపాటు మోటారుసైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ అప్పలనాయుడు చెప్పారు.

అప్పన్న సన్నిధిలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రజిత్‌భార్గవ్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న రజిత్ భార్గవ్ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ రజిత్‌భార్గవ్ సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని సూపరింటెండెంట్ అప్పలనాయుడు అందజేశారు.

పాతాళ గంగ పదిలం

- సమృద్ధిగా కురిసిన వర్షాలతో నిలకడగా భూగర్భ జలాలు
- సమస్యాత్మక గ్రామాల్లో పరిస్థితి ఆశాజనకం
- ఆర్.కొత్తూరులో 0.29 మీటర్లలోనే అందుబాటులోకి
- వేసవిలో తాగునీటికి ఇబ్బందులు ఉండవంటున్న అధికారులు



భూగర్భ జలమట్టాన్ని లెక్కకడుతున్న అధికారులు



యలమంచిలి మండలం పీఎన్ఆర్ పేట వద్ద బోరు నుంచి వస్తున్న భూగర్భ జలాలు

అనకాపల్లి రూరల్: ఒకప్పుడు బోరు వేయాలంటే వందల అడుగులు తవ్వాల్సి వచ్చేది. అయినా చుక్క నీరు కూడా కనిపించేది కాదు. పదుల సంఖ్యలో వేర్వేరు ప్రాంతాల్లో బోర్లు వేస్తూ రైతులు అప్పుల పాలయ్యేవారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో పాటు, సాగునీటి వనరులు అంతంతమాత్రంగా ఉండడం తదితర కారణాలతో భూగర్భ జలాలపై అన్నదాతలు నమ్మకం పెట్టుకునేవారు కాదు. అయితే మూడేళ్లుగా ఈ పరిస్థితుల్లో మార్పు వచ్చింది. వర్షాలు సమృద్ధిగా కురవడం, నదులు, కాలువల్లో పుష్కలంగా నీరు ప్రవహించడం, చెరువులు నిండడంతో భూగర్భ జలాలు పైకి వచ్చాయి. ప్రభుత్వం కూడా వర్షం రూపంలో పడే ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపడుతూ భూమిలో ఇంకేలా చేస్తోంది. దీంతో భూగర్భ జల మట్టం కూడా పైకి ఎగబాకింది. ఫలితంగా ఈ వేసవిలో తాగు, సాగునీటి ఇబ్బందులకు ఆస్కారమే ఉండదని అధికారులు ధీమాగా చెబుతున్నారు.

జిల్లాలో గత మూడేళ్లుగా వరుణుడు కరుణిస్తుండడంతో పాతాళ గంగ పదిలంగా ఉంది. 2019 ఖరీఫ్ సీజన్ నుంచి ఏటా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. దీంతో జిల్లాలో భూగర్భ జలాలు ఆశాజనకంగా ఉన్నాయి. అన్ని ప్రాంతాల్లోని చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. సాగునీటి ప్రాజెక్టుల్లో నీరు పుష్కలంగా ఉంది. ఫలితంగా భూగర్భ జలాల మట్టం పెరిగింది. రానున్న వేసవి కాలంలో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉండదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ ఏడాది జిల్లాలో 948.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో భూగర్భజలాలు ఆశాజనకంగా ఉన్నాయి.

5.72 మీటర్లలోనే..

ప్రతి నెలా భూగర్భజలాలను సంబంధిత అధికార్లు అంచనా వేస్తారు. జిల్లాలో 81 పీజియో మీటర్లతో తీసిన లెక్కల ప్రకారం ఫిబ్రవరి నెలలో జిల్లా మొత్తం సగటున గ్రౌండ్ వాటర్ 5.72 మీటర్లలో ఉన్నట్టు తేలింది. గత ఏడాది మే నెలలో సగటున 6.13 మీటర్లలో నీరు లభించేది. ప్రస్తుతం భూగర్భజలం 0.41 మీటర్ల పైకి వచ్చింది. గత రెండేళ్లతో పోలిస్తే భూగర్భజలాలు ఆశాజనకంగా ఉన్నాయి. ఎస్.రాయవరం మండలం ఆర్.కొత్తూరు గ్రామంలో కేవలం 0.29 మీటర్లలోనే భూగర్భజలాలు అందుబాటులో ఉండటం విశేషం. కశింకోట మండలం ఏఎస్ పేట, మాకవరపాలెం మండల కేంద్రంలో 1.37 మీటర్లలో, రాంబిల్లి మండలం లాలం కోడూరులో 1.44 మీటర్లు, నర్సీపట్నం పట్టణంలో 1.46 మీటర్లు, ఎస్.రాయవరం మండలం పెద ఉప్పలంలో 1.51 మీటర్లు, కశింకోటలో 1.60 మీటర్లలో నీరు లభ్యమతుండడం విశేషం. జిల్లా వ్యాప్తంగా బావుల్లో నీరు పుష్కలంగా ఉండడంతో వ్యవసాయ, ఉద్యానవన రైతులు సాఫీగా సేద్యపు పనులు చేసుకుంటున్నారు. రైతులు, కూలీలకు చేతి నిండా పనులు ఉండటంతో వలసలకు తావు లేకుండా పోయింది.

గతమంతా కష్టాలే

ఒక్కసారి వెనక్కి చూస్తే 2014–18 మధ్య కాలంలో వర్షాభావ పరిస్థితులు కారణంగా వేలాది బోర్లు ఎండిపోయాయి. భూగర్భజల మట్టం సగటున 5 నుంచి 10 మీటర్లకు పడిపోయింది. కానీ మూడేళ్ల నుంచి పరిస్థితి మారింది. విస్తారంగా వర్షాలు పడుతుండడంతో బోర్ల నుంచి గంగమ్మ పైకి ఉబికి వస్తూ రైతుల్లో ఆనందం నింపుతోంది.

తొలగిన సమస్య

భూగర్భ జలాల వినియోగం 70 శాతం వరకు మాత్రమే ఉండాలి. అంతకు మించి ఉంటే సమస్యాత్మక ప్రాంతాలుగా పరిగణిస్తారు. 90 నుంచి 100 శాతం వరకు ఉంటే అత్యంత సమస్యాత్మకమైన గ్రామాలుగా గుర్తిస్తారు. జిల్లాలో 27 శాతం మాత్రమే జలాలను వినియోగిస్తున్నారు. దీంతో ఎటువంటి సమస్య లేదని అధికారులు చెబుతున్నారు. ఇటీవల ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 146 గ్రామాలను తీవ్ర సమస్యాత్మకమైనవిగా నోటిఫై చేసింది. ఈ జాబితాలో అనకాపల్లి జిల్లాలో ఒక్క గ్రామం కూడా లేకపోవడంతో సమస్య లేకుండా పోయింది.

మరింత జలసంరక్షణ అవసరం

జిల్లాలో వర్షపు నీరు 9 శాతం మాత్రమే భూమిలోకి ఇంకుతోంది. మిగిలిన 91 శాతం వివిధ రూపాల్లో వృథా అవుతోంది. వర్షపు నీరు వృథా కావడాన్ని అరికట్టేందుకే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జల సంరక్షణ పనులు పెద్ద ఎత్తున చేపడుతున్నారు. జలశక్తి అభియాన్ కింద వాటర్ షెడ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో కురిసిన వర్షాల ద్వారా వచ్చే నీటిలో 41 శాతం ఆవిరవుతోంది. మరో 40శాతం వృథాగా పోతోంది. కొంత శాతం నీరు తేమగా మారుతోంది. భూగర్భజలాల అభివృద్ధికి జల సంరక్షణ పనులు మరింత ముమ్మరం చేయాల్సిన అవసరం ఉంది.

మండలాల వారీగా తాజా సగటు నీటి మట్టం ఇలా..

మండలం	నీటిమట్టం (మీటర్లలో)				
		మాకవరపాలెం	4.06	మునగపాక	5.27
		ఎస్.రాయవరం	3.21	నక్కపల్లి	5.19
		వి.మాడుగుల	6.91	నర్సీపట్నం	1.46
బుచ్చెయ్యపేట	8.40	అచ్యుతాపురం	14.37	నాతవరం	3.90
చీడికాడ	3.87	అనకాపల్లి	10.69	పరవాడ	16.63
దేవరాపల్లి	10.43	చోడవరం	18.47	పాయకరావుపేట	7.28
కె.కోటపాడు	5.11	యలమంచిలి	10.80	రాంబిల్లి	5.21
కశింకోట	2.45	గొలుగొండ	25.36	రావికమతం	6.15
కోటవురట్ల	4.73	సబ్బవరం	5.34	రోలుగుంట	5.53

వేసవిలోనూ ఇబ్బంది ఉండదు



జిల్లాలో మూడేళ్లుగా బాగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో భూగర్భజలాలు మెరుగ్గా ఉన్నాయి. ఈ వేసవి మూడు నెలల్లో ఏవిధమైన ఇబ్బంది ఉండదు. గత మూడేళ్లలో వేసవిలో ఎటువంటి సమస్య ఎదురు కాలేదు. భూగర్భ జలాల వినియోగం 27 శాతం మాత్రమే ఉంది. జిల్లా వ్యాప్తంగా నీటి లభ్యతకు ఎటువంటి సమస్య లేదు.

– జి.శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్, భూగర్భ జల గణన శాఖ అనకాపల్లి

ఉపమాక వెంకన్నకు నీరాజనం

- దర్శనానికి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు



స్వామివారి దర్శనానికి వచ్చిన భక్తులు



అద్దాలమహల్‌లో దర్శనమిస్తున్న స్వామివారు

నక్కపల్లి: ఉపమాక వెంకన్న ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కల్యాణోత్సవాల అనంతరం మూడోరోజు ఆదివారం స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాలనుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు నిత్యార్చనలు అభిషేకాలు నిర్వహించారు. బాల భోగనివేదన రాజభోగనివేదన, అష్టదిక్పాలకులకు ఆవాహన, నాలాయిర సేవాకాలం, చిన్నపల్లకిలో తిరువీధి సేవలు తీర్థగోష్టి ప్రసాద వినియోగం నిర్వహించారు. స్వర్ణాభరణాలతో అలంకరించిన స్వామివారిని అద్దాలమహల్‌లో ఉంచారు. కల్యాణశోభతో కాంతులీనుతున్న మలయప్పస్వామిని భక్తులు దర్శించుకున్నారు. ప్రధాన రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్ల ద్వారా స్వామి దర్శనానికి వెళ్లారు. కొండపై మూలవిరాట్‌ను, క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామిని, స్వామివారి ఉత్సవ మూర్తులను దర్శించుకుని ఉపమాకలో జరుగుతున్న తిరునాళ్లను తిలకించి తిరుగు ప్రయాణమయ్యారు. ఉపమాక, వేంపాడు జానకయ్యపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన చిన్నారులు, మహిళలు కోలాటం, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. టీటీడీ, హిందూధర్మప్రచార పరిషత్ వారు ఏర్పాటు చేసిన అన్నమాచార్యకీర్తనలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కల్యాణానికి రాలేని భక్తులు సెలవుదినాల్లోను, పౌర్ణమినాడు స్వామివారిని దర్శించుకుంటారు. కాకినాడ జిల్లా దుగ్గాడకు చెందిన శంకర్ అనే భక్తుడు సుమారు 5 వేలమందికి స్థానికుల సాయంతో ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు.

వెంకన్నను దర్శించుకున్న డీఈవో: జిల్లా విద్యాశాఖాధికారి మహాలక్ష్మమ్మ ఆదివారం ఉపమాక వెంకన్నను దర్శించుకున్నారు. అర్చకులు ఆమె గోత్రనామాలతో పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు.

సందడి చేసిన సాధువు : ఉపమాక వెంకన్న ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఓ సాధువు సందడి చేశారు. నర్సీపట్నం ప్రాంతానికి చెందిన ఆ సాధువు శరీరమంతా విభూది రాసుకుని, మెడలో రుద్రాక్ష మాలలు ధరించి ఆలయాని వచ్చి, కొంతసేపు శంఖం ఊదడంతో అక్కడకు వచ్చిన వారంతా వింతగా చూశారు. సాధువు వద్ద ఆండ్రాయిడ్‌ఫోన్, ఇయర్‌ఫోన్స్‌కూడా ఉండటం విశేషం.

వైభవంగా తిరువీధి ఉత్సవం



వడ్డాదిలో వేంకటేశ్వరస్వామి తిరువీధి ఉత్సవం

బుచ్చెయ్యపేట: వడ్డాది వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మూడవ రోజు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గిరిజాంబ కొండపై ఉన్న ఉత్సవ విగ్రహాలను వడ్డాది వీధుల్లో ఊరేగించారు. గజ, గరుడ వాహనాలపైన, ప్రత్యేకంగా తయారు చేసిన రథంపై స్వామివారి ఉత్సవ విగ్రహాలను మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ తిరువీధి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు పాల్గొని భక్తి గీతాలు ఆలపించారు. ఊరేగింపు రథం లాగడానికి పలువురు పోటీపడ్డారు. ఆదివారం సెలవు రోజుకావడంతో దూరప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కొండ దిగువన, ఆలయం వెనుక భక్తులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రికి ఉచిత భోజన వసతి కల్పించారు. రాత్రి కొండ వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. దేవస్థానం ఈవో శర్మ పలువురు ప్రముఖులకు దగ్గరుండి స్వామి వారి దర్శనం కల్పించి, ప్రసాదాలు అందజేశారు.

జీఐఎస్ సూపర్‌సక్సెస్

- పారిశ్రామిక దిగ్గజాలందరినీ ఒకే వేదిక మీదకు తెచ్చిన ఘనత సీఎం జగన్‌దే
- రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు సాధారణ విషయం కాదు
- డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు



నక్కపల్లిలో విలేకర్లతోమాట్లాడుతున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు

నక్కపల్లి: విశాఖలో ఈ నెల 3, 4 తేదీల్లో రెండురోజుల పాటు నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ సూపర్ సక్సెస్ అయిందని డిప్యూటీ సీఎం, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖామంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. దేశంలో దిగ్గజ పారిశ్రామికవేత్తలందరినీ ఒకే వేదిక మీదకు తీసుకువచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. ఆదివారం ఆయన నక్కపల్లిలో విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో విశాఖలో రెండు రోజుల పాటు నిర్వహించిన సమ్మిట్ రాష్ట్ర చరిత్రను తిరగరాసిందని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దిగ్గజ పారిశ్రామికవేత్తలను రాష్ట్రానికి తీసుకు వచ్చి ఆయా రంగాల్లో వేలకోట్ల పెట్టుబడులకు ఎంవోయూలు కుదుర్చుకున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులకు ఆయా పారిశ్రామికవేత్తలు అంగీకారం తెలిపారని చెప్పారు. దీని వల్ల సుమారు 6లక్షల మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ పెట్టుబడుదారుల సదస్సు ద్వారా తన సత్తా ఏంటో జగన్‌మోహన్‌రెడ్డి మరో సారి రుజువు చేశారని చెప్పారు. గత ప్రభుత్వం మాదిరిగా వందల కోట్ల ప్రజాధనాన్ని వృథాచేసి పారిశ్రామిక టూర్లు, పెట్టుబడుల యాత్ర పేరుతో విదేశీ పర్యటనలు చేయలేదని తెలిపారు. దావోస్ వెళ్లలేదని విమర్శలు చేస్తున్న ప్రతిపక్షాలకు జగన్ తగిన జవాబు చెప్పారన్నారు. ఎక్కడకు వెళ్లామన్నది ముఖ్యం కాదని ఎన్ని పెట్టుబడులకు ఎంవోయూలు కుదుర్చుకున్నామన్నదే ముఖ్యమన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఏదీ చెప్పరని, చేసి చూపిస్తారన్నడానికి ఈ సదస్సే నిదర్శనమని తెలిపారు. అంబానీ, ఆదానీ వంటి పారిశ్రామిక వేత్తలు ఇలాంటి సదస్సుల్లో పాల్గొనడం చాలా అరుదుగా జరుగుతుందని చెప్పారు. త్వరలో విశాఖ కేంద్రంగా పరిపాలన ప్రారంభమవుతుందని, విశాఖ తమ రాజధాని అని జీఐఎస్ సదస్సు సాక్షిగా సీఎం చేసిన ప్రకటన ప్రజలకు ఎంతో ఆనందాన్నిచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణ ఆధ్వర్యంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మంత్రిని దుశ్శాలువాతో డిప్యూటీ సీఎంను సన్మానించారు. నియోజకవర్గంలో పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మంత్రిని కలిసిన వారిలో వైస్ ఎంపీపీ వీసం నానాజీ, సర్పంచ్‌లు సురేష్ వర్మ, భార్గవ్, ఎంపీటీసీలు గొర్లగోవిందు, గంటా తిరుపతిరావు, ఉపసర్పంచ్ వీసం రాజు, నాయకులు అల్లాడ కొండ, ఎల్లేటిసత్తిబాబు, వెదుళ్ల పాపారావు ఉన్నారు.

పేద విద్యార్థులకు వరం

- ప్రైవేట్ స్కూళ్లలో 25% సీట్లు
- నేటి నుంచి పాఠశాలల రిజిస్ట్రేషన్
- సీఎస్‌సీ వెబ్‌సైట్‌లో సమగ్ర వివరాలు
- 18 నుంచి దరఖాస్తుకు అవకాశం
- లాటరీ పద్ధతిలో సీట్ల కేటాయింపు
- అమ్మ ఒడి పథకం కింద ఫీజు చెల్లింపు



విశాఖ విద్య: జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో పేద వర్గాలకు చెందిన విద్యార్థులు ఉచితంగానే చదువుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించింది. నచ్చిన పాఠశాలలో 1వ తరగతిలో ప్రవేశం పొందవచ్చు. సీటు పొందిన విద్యార్థుల ఫీజును అమ్మ ఒడి పథకం కింద ప్రభుత్వం చెల్లించనుంది. 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఏర్పాట్లు చేయాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. సోమవారం నుంచి జిల్లాలో గుర్తింపు ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల నిర్వాహకులు సీఎస్‌సీ వెబ్‌సైట్‌లో తమ వివరాలను అందుబాటులో ఉంచాలి. ప్రవేశాలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు http://cse.ap.gov.in/ అనే వెబ్‌సైట్‌లో చూడవచ్చు. 2022–23లో జిల్లాలో 114 మంది ఈ పథకం ద్వారా లబ్ధిపొందారు. ఈ ఏడాది మరింత ఎక్కువ మంది విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకునేలా అధికారులు దృష్టి సారించారు.

ఇదీ షెడ్యూల్

- సోమవారం నుంచి ఈ నెల 16 వరకు గుర్తింపు ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల నిర్వాహకులు వెబ్‌సైట్‌లో వివరాలను అందుబాటులో ఉంచాలి.
- ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 7 వరకు దరఖాస్తు చేసుకోవాలి.
- ఏప్రిల్ 9 నుంచి 12 వరకు అర్హులైన విద్యార్థుల జాబితాను ప్రకటిస్తారు.
- ఏప్రిల్ 13న మొదటి రౌండ్ జాబితాను లాటరీ పద్ధతిన ప్రకటిస్తారు.
- ఏప్రిల్ 15 నుంచి 21 వరకు సీటు పొందిన విద్యార్థులు పాఠశాలల్లో చేరాలి.
- ఏప్రిల్ 25న రెండో విడత సీటు పొందిన వారి వివరాలు ప్రకటిస్తారు.
- ఏప్రిల్ 26 నుంచి 30 వరకు విద్యార్థులు పాఠశాలల్లో చేరేందుకు అవకాశం ఉంది.

తల్లిదండ్రులకు అండగా టోల్ ఫ్రీ నంబర్

ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో అర్హులైన పేద వర్గాలకు చెందిన విద్యార్థులు ఉచిత సీట్లు పొందే విషయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే, సకాలంలో పరిష్కరించేలా ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. ఇందుకోసం 14417 టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులో ఉంచింది. విద్యార్థుల తల్లిదండ్రులు నేరుగా టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయవచ్చు. వచ్చిన గ్రీవెన్స్‌లను సత్వర పరిష్కారం కోసం ఎంఈవో, డీఈవో స్థాయిలో ప్రత్యేకంగా సెల్ ఏర్పాటు చేస్తున్నారు.

సీట్ల కేటాయింపు ఇలా..

ప్రభుత్వ గుర్తింపు ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు అన్నింటిలో 2023–24 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతిలో తప్పనిసరిగా 25 శాతం సీట్లు పేద వర్గాలకు చెందిన విద్యార్థులకు కేటాయించాలి. ఇందులో అనాథలు, దివ్యాంగులు, హెచ్‌ఐవీ బాధిత పిల్లలకు 5 శాతం, ఎస్సీ–10 శాతం, ఎస్టీ–4 శాతం, ఇతర వర్గాలకు –6 శాతం సీట్లు కేటాయించారు. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.20 లక్షలు, అర్బన్‌లో అయితే రూ.1.44 లక్షలు మించకుండా ఉన్న వారే అర్హులు.

ఫీజు చెల్లింపు ఇలా..

ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో సీటు పొందిన విద్యార్థులు ఏడాదికి ఎంత ఫీజు చెల్లించాలనేది ప్రభుత్వం ముందుగానే నిర్ణయించింది. అర్బన్‌లో రూ.8 వేలు, రూరల్‌లో రూ.6,500లు, గిరిజన/షెడ్యూల్ ప్రాంతాల్లో రూ.5.100. వీటిని అమ్మ ఒడి పథకం కింద విద్యార్థులు ప్రవేశం పొందిన పాఠశాలలకు ప్రభుత్వం చెల్లించనుంది.

సద్వినియోగం చేసుకోవాలి



పేద విద్యార్థులు కార్పొరేట్ స్కూళ్లలో చదువుకోవాలనే కోరిక ఈ కార్యక్రమం ద్వారా నెరవేరుతుంది. ఈ సారి ఎక్కువ మందికి లబ్ధిచేకూర్చేలా దృష్టిసారించాం. దీనిపై విస్తృత ప్రచారం చేస్తున్నాం. విద్యార్థుల తల్లిదండ్రులు దీనిని సద్వినియోగం చేసుకోవాలి.

– ఎల్. చంద్రకళ, డీఈవో, విశాఖ జిల్లా

25 శాతం సీట్లు ఇవ్వాల్సిందే..



పేద విద్యార్థులకు ఇదో వరం అనే చెప్పాలి. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంచి ఆలోచనతో దీన్ని అమలకు సిద్ధమయ్యారు. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు తప్పనిసరిగా ఇవ్వాలి. విద్యాశాఖాధికారులు దీన్ని సీరియస్‌గా తీసుకోవాలి. ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే కమిషన్ దృష్టికి తీసుకురావచ్చు.– డాక్టర్ సీతారాం, రాష్ట్రబాలల హక్కుల కమిషన్ సభ్యుడు

ఉచిత కంప్యూటర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కంచరపాలెం: ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకంలో భాగంగా కంచరపాలెం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ కేంద్రం(బాలికలు)లో ఈ నెల 10వ తేదీ నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు 10వ తరగతి, సుయింగ్ మిషన్ ఆపరేటర్ కోర్సుకు 5వ ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులు. ఆసక్తి ఉన్న 45 ఏళ్ల లోపు ఉన్న నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.గౌరీమణి ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు 94405 96054, 99493 85184లో సంప్రదించవచ్చు.

నేటి నుంచి క్విజ్ పోటీలు

ఏయూక్యాంపస్: ఏయూ – ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో సోమ, మంగళవారాల్లో రీజినల్ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సమన్వయకర్త ఎ.రామ నాగ హనుమాన్ తెలిపారు. ఉత్తరాంధ్రతో పాటు గోదావరి జిల్లాలకు చెందిన కళాశాలల విద్యార్థులు 40 బృందాలుగా ఈ క్విజ్ పోటీల్లో పాల్గొంటున్నారు.

మహిళా సాంస్కృతిక నాట్య వైభవం



మౌనిషా దేవి (అసోం), కిరణ్మయి(తెలంగాణ), రూపాకిరణ్(హాంకాంగ్) నృత్యాభినయం

మద్దిలపాలెం(విశాఖ తూర్పు): ఖండాంతరాలకు చెందిన మహిళలు మన సంప్రదాయ నృత్యాలను అవలీలగా ప్రదర్శించి అబ్బురపరిచారు. ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియం వేదికగా కల్చరల్ అండ్ ఆర్ట్స్ ప్రమోషన్ సొసైటీ(క్యాప్స్)ని రైల్వే న్యూకాలనీలోని ఓ ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేశారు. సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన తొలి ప్రదర్శనను రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, విజయనిర్మాణ్ అధినేత డాక్టర్ సూరపనేని విజయకుమార్, క్యాప్స్ సంస్థ అధ్యక్షురాలు ఎస్.విజయలక్ష్మి ప్రారంభించారు.

- ఈ వేడుకలలో తొలి ప్రదర్శనగా హైదరాబాద్‌కు చెందిన కూచిపూడి నర్తకి డాక్టర్ కిరణ్మయి బోనాల, కర్ణాటకకు చెందిన భరతనాట్య కళాకారిణి ఉమామహేశ్వరి, అసోంకు చెందిన సత్త్రియ నాట్యకారిణి డాక్టర్ మోనీషాదేవి గోస్వామి, హాంగ్‌కాంగ్‌కు చెందిన రూపాకిరణ్ భరతనాట్యంతో ఆకట్టుకున్నారు.

14 మందికి పురస్కారాలు

రాష్ట్రంలో నాట్యం, సంగీతంలో రాణిస్తున్న 14 మందిని శక్తి మహిళా పురస్కారాలతో క్యాప్స్ ప్రతినిధులు సత్కరించారు. తెలంగాణకు చెందిన రంగమణి ఓలేటి, భరతి మండాలతో పాటు విశాఖకు చెందిన సంతోషి విజయ, ఆదిత్యశ్రీ, అరుణా పరమేష్, యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్‌కు చెందిన రేష్మి పథియాత్ ఈ పురస్కారాలు అందుకున్నారు. ప్రముఖ నాట్య గురువు బత్తిన విక్రమ్‌గౌడ్ పర్యవేక్షణలో ఈ వేడుకగా సాగింది.

రేపే అప్పన్నకు పెళ్లిచూపులు

కొండ దిగువ ఉద్యానవన మండపంలో డోలోత్సవం

సింహాచలం: ఫాల్గుణ పౌర్ణమి పురస్కరించుకుని సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి మంగళవారం పెళ్లి చూపులు జరగనున్నాయి. స్వామి పెళ్లి కుమారుడిగా ముస్తాబై.. సింహగిరి నుంచి కొండ దిగువకు విచ్చేయనున్నారు. అక్కడ పుష్కరిణి సత్రంలోని ఉద్యానవన మండపంలో అధిష్టించి డోలోత్సవం నిర్వహించుకుంటారు. పెళ్లి నిశ్చయం అయిన ఆనందంతో అడవివరంలో తిరువీధి జరుపుకోనున్నారు.

ఉత్సవం నిర్వహణ ఇలా...

శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకీలో ఉంచి మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో సింహగిరి నుంచి కొండ దిగువకు మెట్లమార్గం ద్వారా తీసుకొస్తారు. అక్కడి నుంచి అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారి ఆలయానికి తిరువీధిగా తీసుకెళ్తారు. తదుపరి పుష్కరిణి సత్రంలోని ఉద్యానవన మండపానికి తీసుకెళ్లి స్వామిని డోలీలో అధిష్టింపజేస్తారు. వసంతోత్సవం, చూర్ణోత్సవం, డోలోత్సవం నిర్వహిస్తారు. అనంతరం అడవివరంలో తిరువీధి ఉత్సవం జరుగుతుంది. మరలా పైడితల్లి ఆలయం వద్దకు స్వామిని తీసుకెళ్లి అక్కడి నుంచి తిరిగి మెట్లమార్గంలో కొండపైకి చేర్చుతారు. డోలోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆధ్వర్యంలో వైదికులు, అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉద్యానవన మండపాన్ని విశేషంగా ముస్తాబు చేస్తున్నారు.

డోలోత్సవం వెనుక కథ ఇదీ..

డోలోత్సవం నిర్వహణ వెనుక అనాదిగా ఓ కథ ప్రచారంలో ఉంది. సింహగిరిపై కొలువుదీరిన శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి ఏటా చైత్ర శుద్ధ ఏకాదశి రోజున ఎంతో వైభవంగా వార్షిక కల్యాణోత్సవం నిర్వహిస్తారు. చైత్ర శుద్ధ ఏకాదశికి ముందు వచ్చే ఫాల్గుణ పౌర్ణమి రోజున స్వామికి పెళ్లి చూపుల సంప్రదాయంతో డోలోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అడవివరం గ్రామ సంప్రదాయం ప్రకారం దీనిని బొట్టినడిగే పున్నమిగా పిలుస్తారు. అడవివరం గ్రామదేవత పైడితల్లి అమ్మవారిని శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి సోదరిగా అభివర్ణిస్తారు. పైడితల్లి అమ్మవారి కుమార్తెనే శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి పెళ్లి చేసుకున్నారని విశ్వసిస్తారు. అందుకే ఏటా ఫాల్గుణ పౌర్ణమి రోజున తనకు పిల్లనివ్వమని సింహగిరి నుంచి కొండదిగువకు స్వామి వస్తారని, పెళ్లి కుదిరిన ఆనందంలో డోలోత్సవం నిర్వహించుకుంటారని గ్రామస్తులు భావిస్తారు. ఈ క్రమంలోనే సింహగిరిపై నుంచి కొండ దిగువకు వచ్చిన స్వామి తొలుత తన సోదరి అయిన పైడితల్లి ఆలయం వద్దకు వెళ్లి తనకు పిల్లనివ్వమని అడుగుతారు. 'నీకు ఆస్తిపాస్తులు ఏం ఉన్నాయని.. ఏం చూసి పిల్లనివ్వాలని' తొలుత పైడితల్లి ఒప్పుకోదు. దీంతో స్వామి అలిగి అక్కడి నుంచి వెళ్లిపోయి పుష్కరిణి సత్రంలోని ఉద్యానవనమండపంలో అధిష్టిస్తాడు. అక్కడ ఎంతో వైభవంగా డోలోత్సవం, వసంతోత్సవం, చూర్ణోత్సవం జరుపుకుంటారు. ఈ వేడుక విషయాన్ని తెలుసుకున్న పైడితల్లి అమ్మవారు స్వామికి ఎంతో మంది భక్తులు ఉన్నారని, వారే ఆయన ఆస్తి అని తెలుసుకుని పిల్లనివ్వడానికి ఒప్పుకుంటుంది. పిల్లనిస్తానని స్వామిని ఆహ్వానిస్తుంది. స్వామికి పెళ్లి నిశ్చయమైన ఆనందంతో గ్రామస్తులు, భక్తులు, దేవస్థానం ఉద్యోగులు, వైదికులు ఒకరిపై ఒకరు రంగులు జల్లుకుని వసంతోత్సవం జరుపుకుంటారు. ఈ కార్యక్రమాన్నే డోలోత్సవంగా అభివర్ణిస్తారు. డోలోత్సవం అనంతరం ఉగాది రోజున పెళ్లిరాట, చైత్రశుద్ధ ఏకాదశి రోజున వార్షిక కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు.



అడవివరం గ్రామ దేవత, స్వామి సోదరి పైడితల్లి అమ్మవారు



డోలోత్సవం జరిగే కొండదిగువ ఉద్యానవన మండపం

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం



కూచిపూడి నృత్య ప్రదర్శన చేస్తున్న అముక్తమాల్యద

నక్కపల్లి : విజయనగరం జిల్లా గరివిడికి చెందిన అముక్త మాల్యద ఉపమాకలో ఆదివారం చేసిన కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. ఉత్సవాల సందర్భంగా ఆమె ఆదివారం స్వామివారిని దర్శించుకుని, అనంతరం ఆలయంలో కల్యాణ వేదిక ముందు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. ఈ ప్రదర్శన తిలకించిన వారంతా అభినందనలు తెలిపారు.

నేడు జీవీఎంసీ స్పందన

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కమిషనర్ పి.రాజాబాబు కోరారు.

మసీదు భూముల కబ్జా వార్తలు అవాస్తవం

- తక్షణమే మసీదు కమిటీకి ఎన్నికలు నిర్వహించాలి
- మీడియాతో యలమంచిలి జామియా మసీదు పెద్దలు

యలమంచిలి : యలమంచిలి జామియా మసీదుకు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలని స్థానిక ముస్లిం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ యలమంచిలి జామియా మసీదు కమిటీ పదవీకాలం ముగిసినా.. ఎన్నికలు నిర్వహించడం లేదన్నారు. మసీదు జమాత్ లిస్టు ప్రకారం ప్రజాస్వామ్య పద్ధతిలో సీక్రెట్ బ్యాలెట్ విధానంలో ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఇటీవల కొన్ని పచ్చ పత్రికల్లో యలమంచిలి జామియా మసీదుకు సంబంధించిన వక్ఫ్ భూములు కబ్జాకు గురవుతున్నాయని, వైఎస్సార్‌సీపీ నాయకులు అక్రమాలకు పాల్పడుతున్నారని వచ్చిన వార్తలు అవాస్తవమని స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన కొందరు స్వార్థపరులు కావాలనే తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆక్షేపించారు. గత కొన్నేళ్లుగా ఒకే కమిటీ చేస్తున్న ఆరాచకాలు బయట పడతాయనే సీక్రెట్ బ్యాలెట్ ఎన్నికలకు నిరాకరిస్తున్నారని ఆరోపించారు. మసీదు కమిటీ పదవీకాలం 2020 సెప్టెంబర్ 10తో ముగిసినా.. వక్ఫ్ బోర్డు నుంచి ఎలాంటి ఉత్తర్వుల్లేకుండా కమిటీ కొనసాగడం దారుణమన్నారు. ఎక్కడో విశాఖలో ఉండి యలమంచిలిలో మసీదు ఆస్తులు కబ్జాకు గురవుతున్నాయని తప్పుడు ప్రకటనలిస్తున్న ఆ వ్యక్తి తక్షణమే కమిటీకి ఎన్నికలు నిర్వహించి, తప్పుకోవాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డు అధికారులు తక్షణమే స్పందించి యలమంచిలి జామియా మసీదుకు సీక్రెట్ బ్యాలెట్‌లో ఎన్నికలు నిర్వహించాలని కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు, వక్ఫ్ బోర్డుకు, అధికారులకు ఫిర్యాదులు చేసినట్టు తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక ముస్లిం నాయకులు షేక్ అబ్దుల్లా, సయ్యద్ తౌషిఫ్, షేక్ ఆజ్మీర్‌వలీ, షేక్ బషీర్, సయ్యద్ అబ్దుల్ నజీర్, షేక్ హసీన్, షేక్ బుకారీ, షేక్ బసీరుద్దీన్, షేక్ ఖ్వాజా సుల్తాన్ బుర్హాన్, ఎం.డి.అన్సార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యలమంచిలి ముస్లిం నేతలు

ఎమ్మెల్సీగా సీతంరాజు సుధాకర్ గెలుపు తథ్యం

- డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్ భారీ మెజార్టీతో గెలుపు ఖాయమని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. ఈ మేరకు సుధాకర్‌కు మద్దతుగా తారువ, మారేపల్లి, పెదనందిపల్లి, చిననందిపల్లి, నాగయ్యపేట గ్రామాల్లో ఆదివారం ఆయన ప్రచారం చేశారు. పట్టభద్రులను కలిసి తమ మొదటి ప్రాధాన్యత ఓటును సుధాకర్‌కు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తూ, నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు సీఎం జగన్ నిత్యం పరితపిస్తున్నారన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి పట్టభద్రులంతా మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, యువజన అధ్యక్షుడు కర్రి సూరినాయుడు, మహిళా విభాగం అధ్యక్షురాలు రొంగలి నారాయణమ్మ, సీనియర్ నాయకుడు అవుగడ్డ రామ్మూర్తినాయుడు, సర్పంచ్‌లు అవుగడ్డ కన్నతల్లి, పోతల చెల్లయ్యమ్మ, సోమిరెడ్డి సన్నిబాబు, ఎంపీటీసీలు అవుగడ్డ రామదేవి, వంటాకు పైడితల్లమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు బండారు ప్రసాదరావు, తెలకల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కొమ్మునాపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.



తారువలో పట్టభద్రులను ఓటు అభ్యర్థిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ విస్తృత ప్రచారం

బుచ్చెయ్యపేట: వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు ఓటు వేసి గెలిపించాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కోరారు. మండలంలోని బంగారుమెట్ట, లోపూడి, గున్నెంపూడి, చినమదీన, కొండపాలెం, పెదమదీన తదితర గ్రామాల్లో సీతంరాజు సుధాకర్ గెలుపునకు మద్దతుగా ఆదివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి జోరుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ కరోనా విలయంతో ఆర్థిక వ్యవస్థ దెబ్బతిన్నా, ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేయడంతోపాటు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారన్నారు. అటువంటి నాయకుడిని అభినందించాల్సిన ప్రతిపక్షాలు లేనిపోని విమర్శలు చేయడాన్ని పట్టభద్రులు గ్రహించాలన్నారు. ప్రస్తుతం ఎమ్మెల్సీ ఎన్నికలు 2024 అసెంబ్లీ ఎన్నికలకు రెఫరెండం అన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి ప్రతిపక్షాలకు కళ్లు తెరిపించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, జెడ్పీటీసీ దొండా రాంబాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, నాయకులు సాయం రమేష్, యెనుముల వాసు, తమరాన శ్రీను, రమణ, ముచ్చకర్ల అప్పారావు, పచ్చికూర గోవింద, కె. వెంకటరావు, వేపాడ మధు, గుడాల ఆనంద్, బాబూరావు పాల్గొన్నారు.



బంగారుమెట్టలో ప్రచారంలో పాల్గొన్న విప్ ధర్మశ్రీ

వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయం ఖాయం

- రాష్ట్ర సృజనాత్మకత అండ్ సాంస్కృతిక సమితి క్రియేటివ్ హెడ్ జోగినాయుడు

నాతవరం: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులే వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపిస్తాయని రాష్ట్ర సృజనాత్మకత అండ్ సాంస్కృతిక సమితి క్రియేటివ్ హెడ్ ఎల్.జోగినాయుడు తెలిపారు. మండలంలోని పెదగొలుగొండపేటలో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు మొదట ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇతర ప్రాంతాల కంటే నర్సీపట్నం నియోజకవర్గం నుంచి అత్యధికంగా ఓట్లు వేయడానికి ఎమ్మెల్యే గణేష్, డీసీసీబీ చైర్‌పర్సన్ చింతకాయల అనిత సన్యాసిపాత్రుడు ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో టీడీపీ ఎన్ని జిమ్మిక్కులు చేసినా ఆఖరికి విజయం వైఎస్సార్‌సీపీదేనని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ రజాక్, సర్పంచ్ మిరపల వెంకటరమణ, ఎంపీటీసీ సభ్యుడు తమరాన సత్యనారాయణ, నాయకుడు దేవాడ శ్రీను పాల్గొన్నారు.



పెదగొలుగొండపేటలో సుధాకర్‌ను గెలిపించాలని ప్రచారం చేస్తున్న జోగినాయుడు

ఆ కలయికకు 46 ఏళ్లు!

- నందడి చేసిన 1975-77 బ్యాచ్ ఇంటర్ విద్యార్థులు

చోడవరం రూరల్: వారంతా 46 ఏళ్ల క్రితం ఇంటర్మీడియట్ విద్యనభ్యసించారు. నేడు వారి జీవితానుభవాల పాఠశాలలో తలలు పండిన వారయ్యారు. నేడు తమ తోటి విద్యార్థి ఎ.వి.ఎ స్.వి.ఎస్.ప్రసాద్ చొరవతో ఒకే చోటకు చేరుకున్నారు. వారి కళ్లలో మెరుపులు.. వారి వయసులో ఉరుకులు.. ఆనాటి చిన్నతనంలోకి తీసుకుని వెళ్లాయి. 1975-77 విద్యా సంవత్సరాల్లో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యనభ్యసించారు. ఆ తర్వాత తమ జీవన గమనంలో వారి వారి దారుల్లో పయనించారు. రాజకీయంగా, ఉద్యోగపరంగా, వ్యాపార పరంగా, వ్యవసాయంలో ఇలా అంతా స్థిరపడ్డారు. అటు తర్వాత అప్పుడప్పుడూ ఒక్కొక్కరూ, ఒకరిద్దరు కలుసుకుని పలకరింపులు చేసుకున్నా, ఇన్నేళ్ల తర్వాత తమ సహ విద్యార్థి చొరవతో అందరూ ఒక్కచోట ఏకమయ్యారు. ఇంకేముంది వారిలో నూతనోత్సాహం వెల్లివిరిసింది. ఒక్కసారిగా యువకులుగా మారిపోయారు. తమ జీవిత అనుభవాలను అందరితో పంచుకున్నారు. వీరి కలయికకు స్థానిక ప్రైవేటు కళ్యాణ మండపం ఆతిథ్యాన్నిచ్చింది.



హాజరైన పూర్వ విద్యార్థులు

నాగేంద్ర హత్య కేసులో దర్యాప్తు వేగవంతం చేయాలి



దళితులు ఐక్యత వర్ధిల్లాలని సంఘీభావం తెలుపుతున్న దళిత నాయకులు



దళిత సంఘాల నాయకులు రౌండ్ టేబుల్ సమావేశం

పాయకరావుపేట : పీఎల్ పురం గ్రామంలో దళిత యువకుడు వడ్లమూరి నాగేంద్రను హత్య చేసిన వారిని పోలీసులు తక్షణమే అరెస్టు చేయాలని, లేకుంటే ఈ నెల 11 న మహా ధర్నా నిర్వహించడం జరుగుతుందని దళిత సంఘాలు పిలుపునిచ్చాయి. పట్టణంలో గల అంబేద్కర్ పార్కులో ఆదివారం రౌండు టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీనియర్ దళిత నాయకులు పెదపాటి మేఘరంజన్, రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు తంతడి కిరణ్ కుమార్, భీమ్‌సేన అధ్యక్షుడు రవి సిద్దార్థ మాట్లాడుతూ దళిత యువకుడైన వడ్లమూరి వీరనాగేంద్రను అతి కిరాతకంగా హత్య చేసి, కాళ్ళు, చేతులు తాళ్ళతో కట్టేసి బావిలో పడేసారన్నారు. నాగేంద్ర హత్యకు కారకులైన వారిని పోలీసులు వెంటనే అరెస్టు చేయాలన్నారు. నాగేంద్ర కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. లేకుంటే ఈ నెల 11వ తేదీన మహాధర్నా నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి

హత్యకు గురైన దళిత యువకుడి కుటుంబానికి ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకుడు, జెడ్పీటీసీ లంక సూర్యానారాయణ అన్నారు. నాగేంద్ర హత్య కేసులో దర్యాప్తు వేగవంతం చేయాలని, హంతకులను వెంటనే అరెస్టు చేయాలని అన్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. సమావేశంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు అరుగుల మోసే ఎస్సీ, ఎస్టీ రైల్వే ఉద్యోగుల యూనియన్ నాయకులు బద్ద నర్సింగరావు, దళిత సంఘాల నాయకులు నెలపర్తి అర్జున్, బోడపాటి శ్రీను, రెల్లి సంఘాల నాయకులు కశింకోట సత్తిబాబు, కువ్వల కుమార్, వేమగిరి లక్ష్మణ్, బయ్య నానాజీ, డి.నానాజీ, ఇంజరపు సూరిబాబు, పల్లా ప్రసాద్, తాటిపాక లోవరాజు, తుమ్మలపల్లి కుమార్ పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని లారీడ్రైవర్‌కు గాయాలు

యలమంచిలి : రోడ్డు దాటుతున్న లారీ డ్రైవర్‌ను ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదం ఆదివారం రాత్రి మండలంలోని లక్కవరం కూడలి వద్ద జరిగింది. కాకినాడ నుంచి పెందుర్తి వెళుతున్న లారీ డ్రైవర్ చింతల గోవింద్ భోజనం చేయడానికి 16 వ నెంబరు జాతీయ రహదారిపై లక్కవరం వద్ద వాహనాన్ని ఆపి రోడ్డు అవతల ఉన్న హోటల్‌కు వెళ్తుండగా పులపర్తి నుంచి యలమంచిలి వైపు వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన గోవింద్‌ను 108 వాహనంలో చికిత్స నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రమాదంలో గోవింద్‌కు కుడికాలు విరిగిపోయింది. ద్విచక్రవాహనాన్ని నిర్లక్ష్యంగా నడపడమే ప్రమాదానికి కారణంగా ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. స్థానికులు ప్రమాద సమాచారాన్ని పోలీసులకు తెలిపారు.

పశువుల పాకలు, వరి కుప్పలు దగ్ధం

కె.కోటపాడు : పాడుగుపాలెంలో ఆదివారం ఉదయం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మడల గోవింద, రమణల పశువుల పాకల్లో ఉదయం 11 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికులు మంటలు అదుపు చేయలేకపోవడంతో చోడవరం అగ్నిమాపక శకటం వచ్చి మంటలను అదుపు చేసింది. రెండు పాకలతోపాటు రెండు వరి కుప్పలు కాలిపోయాయి. రూ.1.50 లక్షల ఆస్తి నష్టం కలిగి ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

ఏపీలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ భేష్

తమిళనాడు ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ప్రశంస

గాజువాక : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమల్లోకి తీసుకొచ్చిన ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ అద్భుతంగా ఉందని తమిళనాడు రాష్ట్ర హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ సెంథిల్ కుమార్ ప్రశంసించారు. విశాఖ పర్యటనకు విచ్చేసిన ఆయన గాజువాక పీహెచ్‌సీని ఆదివారం సందర్శించారు. ఓపీ రిజిస్ట్రేషన్, ఫార్మసీ స్టోర్స్, ల్యాబ్ టెస్టులు, ఆప్తమాలజీ, ఇన్‌పేషెంట్, లేబర్ రూమ్, ఆపరేషన్ థియేటర్, వివిధ రిపోర్టులతోపాటు రోగులకు అందిస్తున్న సేవలను ఆన్‌లైన్, యాప్‌లలో నమోదు చేస్తున్న విధానాన్ని ఈ సందర్భంగా పరిశీలించారు. అనంతరం పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. వైద్యులే రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యం అందించే విధంగా నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ బాగుందన్నారు. గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలను అభినందించారు. గర్భిణీ నుంచి డెలివరీ అయిన తరువాత పిల్లల ఇమ్యూనైజేషన్ వరకు అందుతున్న సేవలు ఆంధ్రప్రదేశ్‌లో బాగా జరుగుతున్నాయన్నారు. ఈ సంజీవిని కాల్స్ స్పెషలిస్ట్ సేవలు, నేషనల్ హెల్త్ ప్రోగ్రామ్స్ పక్కాగా అమలవుతుందన్నారు.

ఆయనతోపాటు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి పి.జగదీశ్వరరావు, అదనపు డీఎం అండ్ హెచ్‌వో పూర్ణేంద్రబాబు, మహిళా వైద్యాధికారి డాక్టర్ బి.ఉమావతి, గాజువాక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వై.రామకృష్ణ, సీహెచ్‌వో పి.నాగఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సెంథిల్ కుమార్

అందరి చూపు.. ఆర్గానిక్ వైపు.!

ఆకట్టుకున్న సహజ, సేంద్రీయ ఉత్పత్తుల ప్రదర్శన



ఎంవీపీకాలనీ: నేచురల్ లివింగ్ ఎక్స్‌పో పేరిట ఎంవీపీకాలనీలోని ఏఎస్ రాజా మైదానంలో ఆదివారం నిర్వహించిన సహజ, సేంద్రీయ ఉత్పత్తుల ఎగ్జిబిషన్‌కు విశేష స్పందన లభించింది. మహిళా దినోత్సవం పురస్కరించుకుని విశాఖ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ వుమెన్ వింగ్ ఈ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసింది. సేంద్రీయ ఉత్పత్తుల స్టాళ్లు, ఆరోగ్యకరమైన బేక్స్, చెక్క ఉత్పత్తులు, చేనేత వస్త్రాలు, సేంద్రీయ వంటకాలు, మిల్లెట్ స్టాళ్లు సందర్శకులను ఆకట్టుకున్నాయి. వీసీసీఐ అధ్యక్షుడు ఆర్.సతీష్, గౌరవ కార్యదర్శి రోలాండ్ విలియమ్స్, వీసీసీఐ మహిళా విభాగం అధ్యక్షురాలు జీజా వల్సరాజ్, నగర ప్రముఖులు పాల్గొన్నారు.



ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన ఉత్పత్తులు, తిలకిస్తున్న సందర్శకులు



క్లుప్తంగా

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

అనకాపల్లిటౌన్ : స్థానిక బెల్లం మార్కెట్‌యార్డులో వాకర్స్‌క్లబ్, ఉషా ప్రైమ్ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరానికి సుమారు 150 మంది హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ప్రముఖ వైద్యుడు నాయుడు రోగుల్ని పరీక్షించి, అవసరమైన మందుల్ని అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు యల్లపు శివ, కార్యదర్శి భీశెట్టి రామకృష్ణ, కోశాధికారి రాపేటి నారాయణరావు, సభ్యులు ఆళ్ల ఓంరామ్, కాండ్రేగుల నూకరాజు, బుద్ధ కాశీవిశ్వేశ్వరరావు, బుద్ధ రమణ పాల్గొన్నారు.

ప్రతి నెలా పేదలకు సాయం



సమావేశంలో మాట్లాడుతున్న సతీష్‌కుమార్

అనకాపల్లిటౌన్ : ప్రతి నెలా ఐదుగురు పేదలకు రూ.200 చొప్పున నగదు అందజేయనున్నట్లు వాసవీక్లబ్ అధ్యక్షుడు బండారు సతీష్‌కుమార్ అన్నారు. స్థానిక కుమ్మరివీధి మహానందీశ్వరాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. క్లబ్ ఆశయాలకనుగుణంగా సేవలు మెరుగుపరిచే విధంగా పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వెంకటరమణ, సభ్యులు బి.సతీష్‌కుమార్, ఎంఆర్ నాగేశ్వరరావు, చంద్రశేఖర్, నాగు, మూర్తి, కృష్ణ, రాజేష్, వేణు పాల్గొన్నారు.

8, 9 తేదీలలో మండల స్థాయి వాలీబాల్ టోర్నీ

కోటవురట్ల: కై లాసపట్నంలో నూతనంగా నిర్మించిన శ్రీ నూకాంబికా అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవంలో భాగంగా మండల స్థాయి వాలీబాల్ టోర్నీ నిర్వహిస్తున్నట్టు మాజీ సర్పంచ్ సిద్ధాబత్తుల నాగేశ్వరరావు తెలిపారు. విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 8, 9 తేదీలలో మండల స్థాయిలో టోర్నమెంట్ జరుగుతుందని తెలిపారు. టోర్నీలో గెలుపొందిన టీమ్స్‌కు ప్రథమ బహుమతిగా రూ.10 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.5 వేలు అందజేస్తామని తెలిపారు. వివరాలకు 7013460075, 6300415053 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేడు పరదేశిమాంబ విగ్రహ ప్రతిష్ట

మునగపాక : రామారాయుడుపేటలో సోమవారం పరదేశిమాంబ అమ్మవారి గుడి, విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9.38 గంటలకు ప్రతిష్ట జరుగుతుందని, మధ్యాహ్నం 12 గంటలకు అన్న సమారాధన ఉంటుందన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు.

అనకాపల్లి సినిమాలు

సార్	రాజా
కోనసీమ	సత్యనారాయణ స్క్రీన్-1
సాచి	సత్యనారాయణ స్క్రీన్-2
వినరో భాగ్యము విష్ణుకథ	షిర్డిసాయి
బలగం	పర్తిసాయి
ఆర్గానిక్ మామ హైబ్రీడ్ అల్లుడు	వెంకటేశ్వర
బిగ్ స్నేక్ కింగ్	శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	రామచంద్ర


రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 44 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-8 యూనిట్లు, బీ పాజిటివ్-21 యూనిట్లు, ఓ పాజిటివ్-12 యూనిట్లు, ఏబీ పాజిటివ్-3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 104 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారికి 217 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

శిథిల భవనాలు ఆకతాయిలకు ఆవాసాలు



శిథిలావస్థకు చేరిన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

- శిథిలమైన సబ్ రిజిస్ట్రార్, న్యాయసముదాయాలు
- పగలంతా ఆటోస్టాండ్ నిర్వహణ
- చీకటిపడితే మందుబాబులకు అడ్డా

అనకాపల్లిటౌన్ : శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ భవనాలు అసాంఘిక కార్యకలాపాలకు ఆవాసాలుగా మారుతున్నాయి. పగలంతా ఆటోవాలాలు.. రాత్రయితే తాగుబోతులు, ఆకతాయిలకు తమ అడ్డాగా మార్చుకుంటున్నారు. కాస్త చీకటి పడ్డాక ఈ దారి వెంట మహిళలు వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి. ఇదంతా స్థానిక శారదానది వంతెన రహదారిలో శిథిలావస్థకు చేరిన పాత సబ్‌రిజిస్ట్రార్, న్యాయ సముదాయాల గురించే.

పట్టణం నడిబొడ్డున

ఇటీవల కాలంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. రోడ్లపై ఏ మాత్రం అల్లరి చేసినా.. పోలీస్ జీపులో ఈడ్చుకెళ్తున్నారు. దీంతో ఇలాంటి ఆకతాయిలు, మందుబాబులు సాయంత్రం బాతాఖానీ పేరిట పట్టణం నడిబొడ్డున ఉన్న ఈ శిథిల భవనాల వద్దకు చేరుకుంటున్నారు. సాయంత్రమైతే చాలు తమ ప్రతాపం చూపిస్తున్నారు. తాగి రోడ్లపై నానాయాగీ చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. వీరి వల్ల చీకటిపడ్డాక తమ వ్యాపార సముదాయాల వద్దకు మహిళలు వచ్చేందుకు భయపడుతున్నారని వ్యాపారస్తులు ఆరోపిస్తున్నారు.



పాడుబడిన న్యాయసముదాయంలో ఆటోల పార్కింగ్

అద్దె భవనాల్లో ఎన్నాళ్లు?

శిథిలావస్థకు చేరుకున్న ఈ భవనాలను తొలగించి, నూతన నిర్మాణాలు చేపట్టాలన్న డిమాండ్ చాన్నాళ్ల నుంచి ఉంది. ప్రస్తుతం న్యాయ సముదాయాన్ని అనకాపల్లి-విశాఖ రోడ్డులో కొణతాల ఆర్ట్స్ కళాశాలకు మార్చారు. దీంతో వివిధ కేసులపై వచ్చే కక్షిదారులు, రోజూ విధులకు హాజరయ్యే న్యాయవాదులు రాకపోకలకు ఇబ్బంది పడాల్సి వస్తోంది. నిత్యం రద్దీగా ఉండే ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలో ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ మార్పుపై అఖిల పక్షాల ఆందోళనల నేపథ్యంలో బైపాస్‌రోడ్డుకు మార్చేందుకు నిర్ణయించారు. అద్దె భవనాల్లో కొనసాగే బదులు, శిథిల భవనాలను తొలగించి, తమ శాఖలకు చెందిన స్థలాల్లో కొత్తగా నిర్మాణాలు చేపడితే బాగుంటుందని సిబ్బంది, స్థానికులు కోరుతున్నారు. అదే జరిగితే చీకటి కార్యకలాపాలకు కూడా చెక్‌పడుతుంది.

వ్యాపారాలకు ఆటంకం



చీకటిపడితే చాలు.. పాతబడ్డ రిజిస్ట్రార్, కోర్టు సముదాయంలో మందుబాబులు చేరుతున్నారు. పూటుగా మద్యం సేవించి వీరంగం సృష్టిస్తున్నారు. ఈ గొడవలకు ఆడవాళ్లతోపాటు చిన్నారులు కూడా మా షాపుల వద్దకు రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. పోలీసు యంత్రాంగం రోజూ రాత్రి సమయంలో ఈ రెండు భవనాల వద్ద గస్తీ నిర్వహించాలి.

– పడాల కోటి, వ్యాపారి

ప్రతి రోజూ భయం భయం



శిథిల భవనాల్లో పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. వాటి లోంచి విషపురుగులు వస్తున్నాయి. రాత్రి, పగలు తేడా లేకుండా పెద్ద పెద్ద పాములు కూడా తిరుగాడుతున్నాయి. దీంతో వ్యాపారం చేయడానికి భయంగా ఉంది. అంతేకాకుండా ఇటీవల కాలంలో యువత మద్యం సేవించి ఘర్షణకు దిగుతున్నారు. పెద్దపెద్ద అరుపులతో నానా యాగీ చేస్తున్నారు.

– సతీష్, స్థానిక వ్యాపారి

గౌరమ్మా.. పోయిరావమ్మా..!



కశింకోటలోని గవరపేటలో శారదానదిలో గౌరమ్మ నిమజ్జనం



రేలా రేలా రే ప్రదర్శన

- వేడుకగా వెలంపేట గౌరమ్మ నిమజ్జనోత్సవం

కశింకోట : స్థానిక వెలంపేట గౌరీపరమేశ్వరుల (గౌరమ్మ) నిమజ్జనోత్సవం ఆదివారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా గౌరమ్మ విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి ఆర్కెస్ట్రా, మేళతాళాలతో గవరపేట, పెదగుమ్మం వద్ద శారదానది వరకు ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రజలు గౌరమ్మను దర్శించుకుని పూజలు చేశారు. బాణసంచా కాల్చారు. అనంతరం గౌరమ్మ విగ్రహానికి నది ఒడ్డున సంప్రదాయంగా పూజలు నిర్వహించి, నదిలో నిమజ్జనం చేశారు. ఈ ఏడాదంతా చల్లగ కాచిన తల్లీ.. వచ్చే ఏడాది మళ్లీ రావమ్మా.. అంటూ మొక్కుకున్నారు. శనివారం రాత్రి ఉత్సవం సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు ఉత్సాహంగా హాజరయ్యారు. రేలా రేలా రే, డ్యాన్స్ బేబీ డ్యాన్స్, బుర్రకథ, గంధవరం బృందంతో వెంకటరమణమూర్తి పాట ఆలాపన తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

శభాష్ వలంటీర్!



కేజీహెచ్‌లో సంజీవ్‌కు పింఛన్ సొమ్ము ఇస్తున్న వలంటీర్ నానాజీ

కశింకోట : డయాలసిస్ సమస్యతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తికి పింఛన్ సొమ్ము చెల్లించి గ్రామ వలంటీర్ సేవా నిరతిని చాటుకున్నారు. మండలంలోని తేగాడ గ్రామానికి చెందిన కొంకిపూడి సంజీవ్ గత కొంత కాలంగా డయాలసిస్ సమస్యతో విశాఖ కేజీహెచ్‌లో చేరి చికిత్స పొందుతున్నాడు. అతనికి ఈ నెల పింఛన్ వచ్చింది. దాన్ని అందివ్వడానికి గ్రామ వలంటీర్ నగిరెడ్డి నానాజీ సొంత ఖర్చులతో విశాఖలోని ఆస్పత్రికి వెళ్లి లబ్ధిదారునికి పింఛన్ సొమ్ము అందజేశారు. దీంతో అధికారులు, సచివాలయ సిబ్బంది నానాజీని అభినందించారు.

వరాహ లక్ష్మీనృసింహునికి ప్రత్యేక పూజలు రేపు

అనకాపల్లిటౌన్ : స్థానిక గవరపాలెం వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో మంగళవారం పలు ఆధ్యాత్మిక, పూజా కార్య క్రమాలు నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకులు మళ్ల రామచంద్రరావు ఆదివారం ఓ ప్రకటన లో తెలిపారు. ఆ రోజు ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకం, అమ్మవారికి నూతన చీర అలంకరణ, దీపాలంకరణ తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులంతా పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు సేవించాల్సిందిగా కోరారు.

శంఖ ప్రక్షాళనతో శరీర శుద్ధి

కశింకోట : శరీర శుద్ధికి చేసే యోగ క్రియలన్నింటిలో శంఖ ప్రక్షాళనం శ్రేష్టమైనదని భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ యోగ శిక్షకుడు రమేష్ అన్నారు. అనకాపల్లి మండలం కోడూరులో జార్జి క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం శంఖ ప్రక్షాళన క్రియలు నిర్వహించారు. యోగ సాధకుల శరీరాన్ని అమూలాగ్రం శుద్ధి చేయడానికి ఈ క్రియలు జరిపారు. ఈ కార్యక్రమంలో రమేష్‌తోపాటు ఆరోగ్య ధాత్రి చీఫ్ ఫిజీషియన్ సుందర్ పెరుమాళ్లు, పతంజలి యోగ సమితి జిల్లా అధ్యక్షుడు భీశెట్టి దొరంనాయుడు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

అనకాపల్లిటౌన్ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల బరిలో ఉన్న టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి చిరంజీవిరావు తరపున ఆ పార్టీ బీసీ సాధికార సమితి గవర రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర ఆదివారం ప్రచారం చేశారు. పట్టణంలోని గవరపాలెం, అగ్గిమర్రిచెట్టు, బాలాజీరావుపేట తదితర ప్రాంతాల్లో ఓటర్లను కలిసి, తొలి ప్రాధాన్యతా ఓటు చిరంజీవికి వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఉపాధ్యాయ, ఉద్యోగ, నిరుద్యోగుల ఆకాంక్షలు నెరవేరాలంటే ఎన్నో ఏళ్లుగా పోటీ పరీక్షల శిక్షణలో ఉన్న చిరంజీవిని గెలిపించాలని కోరారు.

70 మంది రక్తదానం

కశింకోట : అనకాపల్లి మండలం రేబాక గ్రామంలో ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 70 మంది రక్తదానం చేశారు. అలాగే సుమారు 300 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో మెడికవర్ ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొని సేవలందించారు.

'సమస్యల పరిష్కారానికి కృషి'



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి మాధవ్


అనకాపల్లిటౌన్ : టీచర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పట్టభద్రుల బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పీవీఎన్ మాధవ్ అన్నారు. స్థానిక రోటరీ కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన జనసేన, బీజేపీ ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు కోలపర్తి శ్రీను, పీలా మురళి, కొణతాల అప్పలరాజు, వి.వి.రామరాజు, జనసేన నేతలు తాడి రామకృష్ణ, రామగోవింద దొర, దూళం గోపి, మళ్ల శ్రీను పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు చకచకా..

ఉగాదినాటికి ప్రవేశాలకు సన్నద్ధం



చురుగ్గా గృహ నిర్మాణాలు చేపడుతున్న లబ్ధిదారులు



అమృతపురం వైఎస్సార్ కాలనీలో గృహ నిర్మాణాలు

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాల్లో గృహ నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే పలు లేఅవుట్‌లలో గృహ నిర్మాణాలు పూర్తి కాగా మరికొన్ని లేఅవుట్‌లలో తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి. గృహ నిర్మాణ శాఖ ఈ ఉగాది నాటికి పెద్ద ఎత్తున గృహ నిర్మాణాలు పూర్తి చేయడం లక్ష్యంగా పనిచేస్తోంది. మండలంలోని పలు శాఖల అధికారులు,సచివాలయాల సిబ్బందితో సమీక్షలు నిర్వహిస్తోంది. పీఎంఏవై-వైఎస్సార్ గృహ నిర్మాణ పథకంలో భాగంగా గృహ నిర్మాణ లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి సాయం సత్వరం అందించే విధంగా చర్యలు చేపడుతున్నారు. గృహ నిర్మాణం చేపట్టే లబ్ధిదార్లకు రూ.1,80,000 ప్రభుత్వం నుంచి అందించనున్నారు. దీంతో పాటు డ్వాక్రాలో ఉండే మహిళలకు రూ.35 రుణ సహాయంతో పాటు 20 టన్నుల ఇసుక ఉచితంగా అందించనున్నారు. గృహ నిర్మాణానికి అవసరమయ్యే 90 బస్తాల సిమెంట్, 485 కిలోల ఇనుము రాయితీపై అందిస్తున్నారు.

మౌలిక సదుపాయాల కల్పన

గృహ నిర్మాణాలు పూర్తయిన కాలనీల్లో ప్రభుత్వం అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తోంది. ఇంటి నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులకు ఉచిత విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేయడంతో పాటు ఇంటింటికీ ఉచిత తాగునీటి కుళాయిలే ఏర్పాటు చేయనున్నారు. అన్ని కాలనీల్లో వీధిరోడ్లు, సామాజిక అవసరాలకు తగిన విధంగా పాఠశాలలు, మరుగుదొడ్లు ఏర్పాటు చేసేందుకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో గృహ నిర్మాణాలు చకచకా సాగుతున్నాయి.

సొంతింటి కల నెరవేరింది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో మా సొంతింటి కల సాకారమయ్యింది. ప్రభుత్వం ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణం చేపట్టేందుకు అవసమయ్యే నిధులు విడుదల చేయడంతో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాం. కాలనీలో అందరి కంటే ముందుగా నిర్మాణం పూర్తి చేసి ప్రస్తుతం నివాసం ఉంటున్నాం. గతంలో ఉమ్మడి కుంటుంబంలో అందరం ఒకే ఇంట్లో ఇబ్బందులు పడుతూ నివాసం ఉండేవారం. చదువుకుంటున్న పిల్లలతో కలిసి నిచ్చింతగా సొంతిట్లో ఉంటున్నాం.

– గండి రమాదేవి, అమృతపురం, సబ్బవరం మండలం.

సంక్షేమ పథకాలే సుధాకర్‌ను గెలిపిస్తాయ్



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్



వేల్పులవీధిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు

అనకాపల్లి రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రతీ ఇంటికి లబ్ధి చేకూరుతోందని, ఈ పథకాలే ఉత్తరాంధ్ర పట్టభద్రు ల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయానికి కారణమవుతాయని పార్టీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ అన్నారు. ఆదివారం తుమ్మపాల పంచాయతీ పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికలకు ప్రచారం చేశా రు. పలువురు ఓటర్లను దిలీప్ కుమార్ కలిశా రు. మొదటి ప్రాధాన్యతా ఓటును సీతంరాజు సుధాకర్ కు వేసి గెలిపించాలని కోరారు. అనంతరం ఏలేరు కాలువ నుంచి చిన్నబాబు కాలనీ వరకూ మెయిన్‌రోడ్డు మీదుగా బైక్ ర్యాలీ చేపట్టారు. ఇందులో సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి, పార్టీ నాయకులు విల్లూరి చంద్రశేఖర్, ఎంపీటీసీలు పంచదార్ల కన్నారావు, పన్నీరు వెంకటలక్ష్మి చంటి, సీనియర్ న్యాయవాది పిళ్లా హర శ్రీనివాససరావు, ఆర్టీసీ సత్యనారాయణ, పడాల గణపతి, వైస్ ప్రెసిడెంట్ చదరం చిన్న, తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లిటౌన్ : వైఎస్సార్‌సీపీ మద్దతుతో పట్టభద్రుల స్థానానికి పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్ విజయం ఖాయమని ఆ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ ధీమా వ్యక్తం చేశారు. వేల్పులవీధిలో ఆదివారం ఆయన స్థానిక నేతలతో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దేశంలో మరెక్కడా లేనన్ని సంక్షేమ పథకాలు అమలుచేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. విశాఖ రాజధానిగా ప్రకటించడమేకాకుండా, రెండురోజులు జీఐఎస్ సదస్సులో సుమారు రూ.13 లక్షల కోట్లు పెట్టుబడులతో 6 లక్షల మందికి ఉపాధి కల్పించనున్న సీఎం జగన్ పాలనకు మద్దతుగా పట్టుభద్రులంతా తమ తొలి ప్రాధాన్యతా ఓటును వేసి సుధాకర్‌ను గెలిపించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఉగ్గిన అప్పారావు, బొండా శంకరరావు, గొర్లి చిన్నా, మద్దాల రమణబాబు, లట్టాల మురళీకృష్ణ, మద్దాల చలపతి, గుండా రమేష్‌గుప్త, బొండా వాసు, జెట్టి శ్రీనివాసరావు, కొంకి శ్రీరామమూర్తి, వాకాడ శంకరరావు, గర్రెడ్డి నూకరాజు, సోమిశెట్టి భార్గవ్, కందికొండ సురేష్, గుమ్మాల చిన్నారి, రౌతులపూడి సంతోష్, గంటా సముద్రాలు, రాయవరపు జోగిరాజు, మేడిశెట్టి గణేష్, బొద్దపు గణేష్, ఇంజరపు వెంకటరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా సుధాకర్ విజయానికి కృషి

కశింకోట : వైఎస్సార్ సీపీ మద్దతుతో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉన్న పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం రాత్రి కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కశింకోట, వెదురుపర్తి గ్రామాల్లో 620 పట్టభద్రుల ఓట్లు ఉన్నాయని, మొదటి ప్రాధాన్యత ఓటును వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థికి వేసేలా చూడాలన్నారు. ఈ మేరకు పార్టీ శ్రేణులు ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా 50 మంది ఓటర్లకు ఒక కమిటీ చొప్పున 13 కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో సర్పంచ్ మంత్రి జయరజని, వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, ఉప సర్పంచ్ నడిపల్లి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయుని తీర్థం



ప్రత్యేక అలంకరణలో అభయాంజనేయస్వామి



మహిళల కోలాటాల ప్రదర్శన

కశింకోట : మండలంలోని ఉగ్గినపాలెంలో అభయాంజనేయస్వామి తీర్థ మహోత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామికి పూలు, వడలతో దండలు చేసి, అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామచంద్రాపురం, లంకెలపాలెం, గాజువాక తదితర ప్రాంతాల నుంచి వచ్చిన బృందాల మహిళలు ప్రదర్శించిన కోలాటాలు ఆహూతులను అలరించాయి. మాజీ సర్పంచ్ కలగా రామునాయుడు, గోవిందల ఆధ్వర్యంలో జరిగిన తీర్థ మహోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి ఉత్సాహంగా ప్రజలు పాల్గొన్నారు.

తూర్పు కాపు సంఘం సమస్యలపై కృషి



సమావేశంలో డైరెక్టర్లను సన్మానిస్తున్న నేతలు

అనకాపల్లి రూరల్ : స్థానిక హేమగిరి సత్యనారాయణ స్వామి కొండ వద్ద ఆదివారం అనకాపల్లి నియోజకవర్గ తూర్పు కాపు సంఘం విస్తృత స్థాయి సమావేశం జరిగింది. సంఘం అధ్యక్షుడు పలకా రాము ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో సమస్యల పరిష్కారం, విద్యార్థులకు ధ్రువపత్రాల మంజూరు కోసం ఐక్యంగా పోరాడాలని నిర్ణయించారు. ఇటీవల బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో డైరెక్టర్లుగా నియమితులైన డాక్టర్ జి.రామ్మూర్తి, అంట్యాకుల రత్నకుమారిలను సంఘ సభ్యులు దుశ్శాలువతో సత్కరించి జ్ఞాపికలను బహూకరించారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి ఎడ్ల త్రినాథరావు, కోశాధికారి సకలా గోవిందరావు, సభ్యులు కోరుకొండ సాంబశివరావు, పొంద్రంకి సత్యారావు, పలకా సత్యనారాయణ, గొన్నాబత్తుల వెంకట రమణ, బొలిశెట్టి శ్రీనివాసరావు, జాజుల రమేష్, కోరుకొండ రాఘవ, పప్పల ఆదినారాయణ, మద్దా కూర్మారావు, చవితిన నర్సింగరావు, నల్లల సత్తిబాబు, కర్రి బాబీ, పేరుపు రాంబాబు, బోడాల రాజు, బొండా శంకరరావు ఆర్టీసీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యాదవుల హక్కుల సాధనకు ఐక్య పోరాటం

కశింకోట : యాదవులంతా ఐక్యతతో తమ హక్కుల కోసం పోరాటం చేయాలని యాదవ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బాబూరావు పిలుపునిచ్చారు. మండలంలోని జమాదులపాలెంలో ఆదివారం నిర్వహించిన మండల యాదవ సంక్షేమ సంఘం సమావేశంలో మాట్లాడుతూ యాదవుల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ విద్యపై దృష్టి సారించి, పిల్లల్ని ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కరక సోమునాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ పంచదార్ల సూరిబాబు, వైస్ ఎంపీపీ నమ్మి మీనా, జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బంధం రమణ, తదితరులు మాట్లాడారు. అనంతరం మండల సంఘం ఎన్నికలు నిర్వహించారు. సంఘం గౌరవాధ్యక్షునిగా పంచదార్ల వెంకటరమణ, అధ్యక్షునిగా కరక రాజు, ప్రధాన కార్యదర్శిగా సారిపల్లి నానిబాబు, ఉపాధ్యక్షునిగా కుండల చంటి, కార్యదర్శులుగా నమ్మి నరసింగరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

హిందూ ధర్మపరిరక్షణకు కృషి

పరవాడ : హిందూ ధర్మరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందించడానికి ముందుకు రావాలని సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధి ఇందిరాదేవి, పరవాడ సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ అప్పలనాయుడు పిలుపునిచ్చారు. లంకెలపాలెం రామాలయ కేంద్రంగా ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. హిందూ ధర్మ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ హిందూ ధర్మాన్ని మారుమూల ప్రాంతాలకు తీసుకువెళ్లడం, ఇబ్బందులను తెలుసుకోవడం, వారానికి ఒకసారి భజన కార్యక్రమం నెలకోసారి సామూహిక హారతి వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పెదపాటి రామచంద్రరావు, గనిరెడ్డి శ్రీను, మాతృమూర్తులు కె.ఈశ్వరమ్మ, పెదపాటి సుజాత, జి.కుమారి, ఎస్.కళావతి, ఎం.లక్ష్మి పాల్గొన్నారు.